# రాసిన రాత

[గల్పిక]

ఒకడు చిన్నవాడు, కవి, మంచివాడు, బీదవాడు. రెండోవాడు అందగాడు, పెద్ద ఉద్యోగి, తెలివిగలవాడు, సంపన్నుడు.

ఈ ఇద్దర్లోనూ ఎవరో ఒకరు తనభర్త కావాలి. ఆమె తన అంతరాత్మలో రెండోవాణ్ణే స్థిరం చేసుకున్నది. కాని ఆ అంతరాత్మ ఏ అజ్ఞాతకారణంచేతనో ఆమెచేత ఆవిషయం వెంటనే బయటపెట్టించలేదు. పైగా ఆమె ఇద్దరితోనూ సమంగానే ప్రవర్తిస్తున్నది.

ఆమెతండ్రికూడా రెండోవాణ్ణే తనఅల్లుడుగా ఎన్నుకున్నాడు: కాని కుమార్తె అభిప్రాయం బయటపెట్టందే తన అభిప్రాయం ఆయన బయటపెట్టదలచలేదు.

ఇంతలో ఒక దైవజ్ఞుడొచ్చాడు, తలవని తలంపుగా. అమ్మాయి జాతకం చూశాడు.

"ఈపిల్లకుత్వరలోనే వివాహంజరగబోతున్నది" అన్నాడు దైవజ్ఞుడమోఘంగా. "అందగాడు, పెద్దఉద్యోగి, తెలివిగలవాడూ, ధనికుడూ అయినభర్తను చేపట్టుతుంది."

"దైవజ్ఞులుచెప్పింది నిజమేనా, నాన్నా?" అన్నదమ్మాయి.

"నాకుమటుకునాకు సందేహంలేదమ్మా!" అన్నాడుతండ్రి.

"అయితే నేను కవిగార్ని చేసుకుంటాను, నాన్నా. నాకు కావలసిన లక్షణాలన్నీ ఉన్నభర్త రాసిపెట్టిఉన్నప్పుడు నాకిష్టమైనవాణ్ణెందుకు చేసుకోకూడదూ? నాక్కావలసిన లక్షణాలు రెండు ఆయనలో ఉన్నప్పటికీ, నాకు నచ్చినవాడు కవిగారే!"

# అంపకాలు

[గల్పిక]

బాబాయి ఊరికెళ్తున్నాడంటే ఈసారి చిట్టికెందుకో పట్టరానిదుఃఖం వచ్చింది. పెద్దవాళ్లతోబాటు తనుకూడా కళ్లల్లో వత్తులేసుక్కూచుంది—మామూలుగా దీపాలుపెట్టగానే నిద్రపొయ్యేది. చుట్టి బెల్టులుబిగించిన బాబాయి పరుపు, సర్ది తాళంవేసిన బాబాయిపెట్టె చూస్తూ ఎట్లానిద్దరపోవటం?

"నేనివాళపోనమ్మా. రేపునిద్దర లేచీ, చక్కగా మనిద్దరం మొహంకడుక్కునీ—" అని బాబాయి బుజ్జగిస్తున్నకొద్దీ చిట్టి బాబాయి మెడకుచేతులుపెనేసి, "ఉఁహుఁ! ఉఁహుఁ!" అని తల అడ్డంగా తిప్పుతూ కొంతసేపు మారాం చేసింది.

అమ్మ కోప్పడ్డది.

"బాబాయికి బరువుకాదులే? చంకదిగు భడవాకానా! దిగుతావా, దిగవా?" అని అమ్మ ఉరిమింది.

నాన్నకూడా కోప్పడ్డాడు.

చిట్టిబావురుమన్నది. దాని కన్నీటితో బాబాయి మొహమంతా తడిసింది. అతనికి ఈప్రేమను నమ్మాలోనమ్మరాదో తెలీలేదు. చిట్టాం అదివరకు తనమీద ఇంత ప్రేమచూపించి ఎరగదు. పోనీ, ఇదంతా వొట్టిమంకుతనం అనుకుందామంటే, ఆ కన్నీళ్లో?

పదికూడా కొట్టింది. ఇకబయిలుదేరకపోతే మెయిలందదు.

"ఇక దిగమ్మా, చిట్టీ! నేను మళ్లీవస్తాగా! నీకు మంచి మంచి బిస్కత్తులూ, పిప్పరమింటుబిళ్లలూ—"

చిట్టాం మళ్లీ బావురుమన్నది. బాబాయి ఇకపట్టలేకపోయి

నాడు. పిల్లను దగ్గరికితీసుకుని కళ్ల నీళ్లుతుడిచి, ముద్దులాడి ఆఖరుకు బలవంతాన వదిలించుకుని బయలుదేరాడు. పోతూ, పోతూ, "పిల్లనేం అనకమ్మా, వొదినా!" అని హెచ్చరించాడు.

బాబాయి వెళ్లిన పావుగంటదాకా చిట్టిఏడుపు తిరుగుమొహం కాలేదు. ఆఖరుకు ఏడుపు ఎక్కిళ్లుగానూ, ఎక్కిళ్లు నిద్రలోకీ ఉపశమించింది.

మాటలఅలికిడికి చిట్టి మేలుకున్నది—కాని కళ్లు తెరవలేదు. అందరూ ఒక్కసారిగా మాట్లాడుతున్నారు. అన్ని గొంతుల్లోనూ బాబాయిగొంతు స్పష్టంగావినిపిస్తున్నది చిట్టికి.

"మెయిలు ఏడుగంటలు లేటు. స్టేషన్లోఉండి ఏమిటి చెయ్యటం? మెయిలుకోసంవచ్చినవాళ్లంతా ఇళ్లకుతిరిగివెళ్లారు ..మళ్లాఏనాలుగింటికో లేచివెళతాను...చిట్టాం-పిచ్చిముండ! అప్పుడే నిద్రపోయి నట్టుందే?" అంటున్నాడు బాబాయి.

"పోయింది ఏడిచీఏడిచీ," అని తల్లి జవాబుచెబుతున్నది.

చిట్టికి కళ్లు తెరవాలని ఎంతమాత్రమూ లేదు. బాబాయి మొహం చూడటాని కెందుకో సిగ్గేసింది. బాబాయి తిరిగి రావటం చిట్టి కిష్టంలేదు. తనదుఃఖమంతా వృథాచేశాడు! తెల్లారుజామునకూడా మళ్లా చిట్టికి మెలుకువవచ్చింది. కాని అప్పుడుకూడా చిట్టి నిద్రపోతున్నట్టే కదలకుండా పడుకున్నది.

మళ్లారైలుకు వెళ్లబోతూ, "చిట్టామను లేపనా?" అన్నాడు బాబాయి నవ్వుతూ. నిజంగా లేపుతాడేమోనని చిట్టికి తగనిభయం వేసింది.

"ఇంకానయం!" అనితల్లనేదాకాచిట్టాంప్రాణంకుదటపల్లే.

---

# చిట్టి

[గల్పిక]

కాంతం కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నది, ఏడవగలుగుతున్నది—అదృష్టవంతురాలు. కాంతం ఏడుపు తన గుండెల్లో నగారా వాయింపు. ఆ ఏడుపు చెవులపడుతుంటే తనకు భయమేస్తున్నదనీ, చిట్టినిగురించి ఆలోచించటానికి తోచటం లేదనీ కాంతం తెలుసుకోదు. కాంతంతల్లి, దురదృష్టవంతురాలు. దాని బాధ, తనకు తెలీదు. తనకు భయమేస్తున్నది గాని ఏడుపురావటం లేదు. తనగుండె అడుగునచిల్లిపడి అశ్రువులన్నీ ఎటోకారిపోయినై. చిట్టినిచూచి అస్తమానమూ నవ్విన తనూ కాంతమూ ఈవిధంగా ఏడవట మేమిటి?... ఎక్కడో పొరపాటుజరిగింది. దేవుడింకా తెలుసుకోలేదు...

కాంతం సమీపానికి వెళ్లటానికి తనకు ధైర్యం లేదు. కాంతం చిట్టికోసం ఏడవకుండా ఉంటే ఎంత బాగుండును! ఏడిచి చిట్టిచావు నిజంచేస్తున్నది కాంతం...

“అమ్మా, నాకళ్లకి నిద్దరొస్తుందే!” అనేదిచిట్టి. అది జ్ఞాపకంవచ్చి తన కేడుపురావటం దేనికి? అప్పుడుతనునవ్వలా? “నీకెక్కడ ఆకలవుతుందే, చిట్టితల్లీ?” అని అడిగితే చిట్టి వాళ్లమ్మతో, “నోట్లోనే!” అనేదిగట్టిగా—కాంతం చెవిటిదైనట్టు! చిట్టికి నోట్లో ఆకలవేది, చిట్టి కళ్లకినిద్దరొచ్చేది! అవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటే కాంతం ఏడవదు. అట్లా ఏడుస్తుంటే కాంతంతో ఇవన్నీ మాట్లాడటం ఎట్లా?

మొగుడుచచ్చిపోతే పెళ్లాం లాగా కాంతం ఇంకో మని

షయిపోతుంది, ఇకముందు కాంతం చిట్టికి అమ్మ అనేమాట ఉండదు. చిట్టికి అమ్మకాని కాంతంతో తను ఎట్లామాట్లాట్టం? ఏడవకుండాఉంటే కాంతం మారేదికాదేమో! తనుమాత్రం బతికిఉన్నంతకాలమూ చిట్టితండ్రిగానే ఉండిపోవాలి. అది అసాధ్యంకాదు. చిట్టినితల్చుకుని తాను ఎప్పటల్లే నవ్వగలగాలి. ప్రయత్నిస్తే సాధ్యమవుతుంది...

అద్దంలో చూసుకుంటే తనమొహమంతా వికారంగా ఉన్నది. అయ్యయ్యో! ఈమొహం చిట్టి ఎల్లా పోల్చుకుంటుంది? తనుకూడా మారితేమెట్లా? తనకి కాంతం కొత్తదైపోయినట్టు, తను కాంతానిక్కూడా కొత్తవాడైపోతే ఎట్లా?...

కాంతం తనదుఃఖమంతా ఖర్చుచేసేసుకుంటున్నది. దుఃఖమంతా అయిపోయి మళ్లామామూలు మనిషిఅయి కాంతం ఇతరవిషయాలు మాట్లాడేప్పుడు తనకెట్లాఉంటుంది? చిట్టిని మరిచిన కాంతంతో తను కాపరంచెయ్యటం ఎట్లా?...

చిత్రం! మనిషికి జబ్బుచేస్తే మొదటి ప్రయత్నంలోనే నయంచెయ్యాలి. ఒకసారి విఫలమై రెండోసారి విజయం పొందటం అంటూఉండదు. చిట్టికిచేసినజబ్బు ఆటేప్రమాదకరమయిందికాదు. చివరిదాకా డాక్టరామాటే అంటూ వచ్చాడు. తనకు తట్టలేదుగాని చిట్టిజబ్బు నయంచేసేమందు ఆయుర్వేదంలో తప్పకుండాఉంటుంది. హోమియోపతీలో కూడా! ఇటువంటిజబ్బే ఆయనెవరో ఏపిస్‌తోనయంచేశాట్ట. చిట్టికి ఏపిస్ వేస్తేసరి! షాపులో పేటెంటుమందులున్నై—

విటామను బీ ఉన్నటువంటివి!...

"ఏమండీ, పాపం, మీపిల్ల పోయిందిటగా? హరి హరీ! ఎంత చలాకీపిల్లండీ! పోయివస్తాను. ఈబస్సుకు మాచారం పోతున్నాను! ఈరైతు లేం చంపుకు తింటున్నారండీ—కాకపోయినా!" ఆయన అంతలోనే చిట్టివిషయం మరిచి పోయినాడు!...

కాంతంఏడుపు వినిపించటంలేదు. పాపం, ఏడిచి ఏడిచి అలిసిపోయిందేమో! లేదు, లేదు, నిశ్శబ్దంగా ఏడుస్తున్నది. పాపం, కాంతం! తనకేసి ఎంతచిత్రంగా చూసింది! చిట్టి జబ్బు నయం కానందుకు కాంతం తనని క్షమించలేదు. ఇక చిట్టినిగురించి తను ఎవరితో మాట్లాడతాడు?...

చిట్టికీ తనకూ ఇరవైరెండేళ్లు తేడా. ఈ తేడా క్షణక్షణమూ జాస్తి అవుతున్నదిగామాలు! ఇంకాపాతికేళ్లుపోయినా చిట్టి మూడేళ్లదేగా! తనకో? తనకి యాభై అవుతై! అప్పుడు తను చిట్టికి తాతయ్యల్లే ఉంటాడుగామాలు!...

నిశ్శబ్దంగా ఏడుస్తుండే కాంతాన్నిచూసి తనగుండె కరగి పోతున్నది. నిజానికి ఈ కాంతం వెనకటి కాంతం కన్నా ఒకవిధంగా ఎంతమంచిది! ఈకాంతం ఇంకోరిపిల్లల్నిచూసి అసూయపడలేదు; చిన్నచిన్న విషయాలనుగురించి మనస్సు క్షోభపెట్టుకోలేదు. చిట్టి ఈవిధంగా తల్లికొక కొత్త ఆధ్యాత్మిక శక్తి నిచ్చిందిగామాలు!...

రెండుయుగాలు—లేక రోజులా?—గడిచిన తరువాత ఈమధ్యాన్నం కాంతంమారినకంఠంతో తననుపలకరించింది.

"లేవండి, స్నానంచెయ్యండి—నాలుగు మెతుకులు

నోట్లో వేసుకుందురుగాని ”

“కాంతం!”

కాంతం దగ్గరకువచ్చి బుజాలమీద చేతులుపెట్టి, తనమెడ మీద మొహంపెట్టి నిశ్శబ్దంగా ఏడవసాగింది. తనకిక ఏడు పాగలేదు. తనూ కాంతమూ కలిసి ఏడవటానికిప్పు డవకాశం దొరికిందా? తన కన్నీళ్లు ఇంతకాలమూ పైకిరాంది ఇందుకా? ఇదివరకు కాంతం ఏడుపు స్వార్థంవల్లనే బాగుండలేదా? ఇద్దరూకలసి సమంగా కన్నీరుకార్చటం ఎంతబాగుంది!...

కామంతో కాంతాన్ని కావిలించుకోవటం మాత్రమే తా నెరుగును. ఇట్లా దుఃఖంతో కావిలించుకోవటం ఎరగడు!...

# బేడా కాసులు ఆదా

[గల్పిక]

"నాన్నా, కృష్ణలీలలు సినిమా చూడవద్దూ?"

"ఉండరా, ఒక ఠేగోలా!...అయితే, భారసాలకు అందర్నీ పిలవాలిసినదేఁటే? వాళ్ళకు బట్టలూ అవీకూడా పెట్టొద్దూ?"

"బాగుందే, వాళ్ళంతా పిల్లలకు ఏవైనా చదివిస్తే అవన్నీ తీసుకుని ఊరుకుంటే ఏం బాగుంటుందీ?"

"ఆఁ! చదివింపులు! గళ్ళరుమాలాలూ, సిల్కుచేతి గుడ్డలూ చదివించినవాళ్ళందరికీ బట్టలుపెడుతూ కూర్చుంటే-చేతులో తడిలేదు."

"అయితే మానెయ్యండి, నాకేం?"

"అవును నీకేం? మాటపడేది నేనేగా!"

"అందుకనే నలుగుర్నీ పిలవండీ, అన్నాను."

"మంచిపనిచేశావు!"

* * *

"మంచిసినిమా, నాన్నా! అంతా వెళుతున్నారు, నాన్నా!"

"ఉండరా, ఒక ఠేగోలా!...మాట్లాడవేమే? చాకలో పోతుంది, ఏటవతల సంబంధం చూస్తాముటే?"

"ఇంకో ఐదువందలకు లోపిస్తారుటండీ? ఊళ్లోవాడూ, చదువుకున్నవాడూ ఉండగా, ఇంకొంచెం ఆస్తివుందిగదా అని పిల్లదాన్ని ఏటవతల ఇచ్చుకుంటే మీరాదాచేసే అయిదువందలూ తిరగటానికి సరిపోదూ?"

"ఏం తిరగటమో! చేతులో తడిలేదు."

"అయితే మానెయ్యండి. నాకేం?
"అవును నీకేం? మాటపడేది నేనేగా!"
"అందుకనే ఊళ్లోసంబంధం చెయ్యండీ అన్నాను."
"మంచిపని చేశావు!"

* * *

"ఇవాళసినిమా ఆఖర్రోజు, నాన్నా! పులులూ, సింహాలూ—మంచిసినిమా, నాన్నా!"

"ఉండరా, ఒకటేగోలా!...చెప్పవేమే? ఇల్లమ్ముదామా, పొలమమ్ముదామా? రెంటికీఒకటే ధరవచ్చేట్టుంది. కాకపోతే, ఇంతకన్న మనకుపొలంమీదే ఎక్కువగిట్టుబాటవుతున్నది."

"అందుకని ఇల్లులేకుండా చేసుకుంటారటండీ?మన నట్టింట మనం తినకమాడినా ఎవరికీ తెలీదు. ఇల్లూ వాకిలీ లేక చెట్టూ పుట్టా పట్టిపోతే మనకుపొలండుందని మన్నించేదెవరండీ?"

"ఎవరో అనుకుంటారని నష్టపడతామేటే? కొంపకేం? అయిదురూపాయలు పారేస్తే ఏ వసారా అయినా దొరక్కపోదు. గంగగోవంటి భూమి—"

"అయితే మీయిష్టమొచ్చినట్టు చెయ్యండి, నాకేం?"
"అవును నీకేం? మాటపడేది నేనేగా?"
"అందుకనే పొలం అమ్మండీ అన్నాను."
"మంచిపని చేశావు!"

* * *

"సినిమాకుపోవద్దు, నాన్నా?"

"బంగారమంటి పొలం కాస్తాపోయింది. ఇంకా సినిమా ఏమిట్రా, వెధవా? జరిగిందంతా సినీమా కాదూ?"

# మంచీ-చెడూ

[గల్పిక]

ఒకనాడు మా శర్మ నాదగ్గరికొచ్చి "నాకు పదిరూపాయలు అర్జంటుగా కావాలిరా బ్రదర్," అన్నాడు.

"నేనందుకే బయల్దేరుతున్నానురా, బ్రదర్!" అన్నాను.

"ఎవరి దగ్గిరికి" అన్నాడు శర్మ.

"రాధాకృష్ణయ్య దగ్గిరికి?"

"ఆ రౌడీవెధవతో నీకు వ్యవహారం ఏమిట్రా?"

"నాకెప్పుడు డబ్బుకావలసినా వాడిదగ్గరికే పోతాను."

"వాడు జూదగాడు, తాగుబోతు, ముండలముఠాకోరు, రౌడీ. వాళ్ల అన్న సీతారామయ్య ఎంతమంచివాడో వీడంత చెడ్డవాడు," అన్నాడు శర్మ.

"అవును. అయినా నేను సీతారామయ్యదగ్గిర డబ్బు తీసుకోను. అంత మంచివాడితో అంత నియమపరుడితో వ్యవహారం చెయ్యటం కష్టం."

"సరే, నీయిష్టం, నేను సీతారామయ్య దగ్గిరికి పోతున్నాను," అని శర్మ బయల్దేరాడు.

*　　　*　　　*

"ఏంరా, బ్రదర్? డబ్బు తెచ్చుకున్నావా?" అన్నాడుశర్మ.

"తెచ్చుకున్నాను," అన్నాను,

"ఇచ్చాడూ?"

"మొదట తనదగ్గర లేదు పొమ్మని కసిరాడు. నాపని చెప్పినతరవాత వెంటనే ఇచ్చాడు, పాపం."

"పాపమా? చండాలుడు! ఆ కుంకచేత కసిరించుకోటానికి నీకెట్లా సిగ్గులేదంట!" అన్నాడు శర్మ.

"సీతారామయ్య నీకు డబ్బిచ్చాడా?" అన్నాను.

"ఎందుకివ్వడూ? అతను మొదట తనదగ్గిరడబ్బు లేదన్నాడు. నా తొందర తెలిసిన తరవాత ఇచ్చాడు. ఇస్తూ, ఎల్లుండికి మళ్ళా అవసరంగా కావాలనీ నాకోసం తనదగ్గిర వున్నదంతా ఇస్తున్నా" ననీ చెప్పాడు!

"మళ్ళా ఎల్లుండి కెట్లాయిస్తావు?".

"ఏదోచూడాలి!"

"అటువంటి హిరణ్యాక్షువరాల్తో డబ్బు తీసుకురావటానికి నీకు సిగ్గులా?" అన్నాను.

"ఇంకానయం, ఇచ్చాడు, పాపం! నాకోసం గనక ఇచ్చాడు కాని, లేకపోతే—"

* * *

"ఇవాళే సీతారామయ్యకు డబ్బిచ్చేయాల్రా, బ్రదర్. ఎట్లా?"

"ఏదో చూస్తా నన్నావుగా?"

"ఏం చూసేది? నా బొంద! ఒకటోతారీకుదాకా మన చేతికి దమ్మిడీరాదే!"

"పోనీ అప్పుడే ఇవ్వు!"

"అమ్మా! ప్రాణమైనా పోగొట్టుకుంటాను గాని సీతారామయ్యతో అన్నమాటతప్పను. అతను అంత ఖరారుమనిషి."

"అనుభవించు."

"నువ్వట్లాఅంటేకాదు, ఏదో చెయ్యాలి."

"ఇవాళ ఉదయం ఇస్తానన్నావా? సాయంకాలమా?"

"ఇవాళ ఎప్పుడైనా సరే!"

"అయితే సాయంకాలం కనపడు!"

"థాంక్స్! బతికించావు."

* * *

"ఇదిగో బ్రదర్, ఈ పదిరూపాయలు తీసుకుపోయి సీతారామయ్య కియ్యి."

"ఎక్కడ తెచ్చావురా?"

"రాధాకృష్ణయ్య దగ్గర."

"ఇచ్చాడా?"

"వాడిదగ్గిరా లేదు. ఫలానిదానికని చెప్పాను. వాడు వెంట నేబయలుదేరి అన్నగారినడిగి పదిరూపాయలు అప్పుతెచ్చి నాకిచ్చాడు, దీన్ని తీసుకుపోయి సీతారామయ్యకియ్యి!"

శర్మ నోటుతీసుకుని, కొంచెం సేపు కూనంగా ఆలోచించి, "సీతారామయ్య నాతో అబద్ధం ఆడాడు" అన్నాడు.

"ఏమని"

"తనదగ్గర డబ్బులేదని."

"అటువంటి అబద్ధాలందరూ ఆడతారు."

"రాధాకృష్ణయ్య చెడ్డవాడనుకున్నాను."

"చెడ్డవాడే!"

"నాకట్లా కనిపించటంలేదు."

"రాధాకృష్ణయ్య చెడ్డవాడేకాని మంచితనం గ్రహించ గలడు. సీతారామయ్య మంచివాడయివుండికూడా మంచి తనం గ్రహించలేడు. అదీ తేడా!" అన్నాను.

# బిడియం

## [గల్పిక]

శారద బి. ఏ. పాసయినప్పటికీ చాలామంచిది. అంటే ఆమెఎన్నడూ అవినీతిగా ప్రవర్తించి ఎరగదు. ఆమెమనస్సు పరపురుషులమీద పోలేదని కాదు. ఒక్కోసారి తనఒంట్లో ఉన్న నరనరమూ ఒక్కో పరపురుషుడికోసం పీకేది. కాని ఆ నరాల పీకుడు కార్యరూపం ధరించలేదు. భగవంతుడు తనశీలాన్ని కాపాడుతూవచ్చాడు. తనప్రేమకు తాత్కాలికంగా పాత్రులు కావచ్చిన మగవాళ్లెప్పటికప్పుడు తన మనస్సులోంచి రాలిపోయినారు.

అయితే శారదభర్తకూడా ఆపరాయి వాళ్ళతోపాటు ఎన్నడో ఆమెమనస్సులోంచి రాలిపోయినాడు...

అయితే ఆమెకిప్పుడు సందేహంపట్టుకుంది. తను పరపురుషుడిమొహం ఎరక్కుండాచావటం చాలాగర్వపడదగ్గ విషయమా? లేక, రహస్యంగా సిగ్గుపడదగ్గ విషయమా? ఈవిషయం తేల్చుకోవలసిన అవసరం కలిగిందిశారదకు. పైప్రశ్నకు వచ్చేసమాధానంమీద ఆమెప్రవర్తన ఆధారపడబోతున్నది.

ఎందుకంటే, ఆకుర్రాడు, శాస్త్రి, తనను గాఢంగాప్రేమిస్తున్నాడు. ఏమీసందేహంలేదు. పదిహేడేళ్లకుర్రాడు శాస్త్ర నలిగిన అందాన్నిమాత్రమే చూడగలు! అంచేత వాళ్ళ మనస్సు ఇరవైఏడేళ్లస్త్రీమీద పోతుంది.

తనకు శాస్త్రిమీద మనస్సుపోయిందని కాదు. ఎబ్బే! పాపం, పసివాడు, పాలుగారేమొహమూ, తియ్యాని పెది

మలూ, తడికళ్లూ, గాలిమీసాలూ, కళ్ళమీదపడే క్రాపూ, సన్నని నడుమూ...ఛీ, ఛీ! తనకాఅబ్బాయిమీద భ్రమ ఎందు కుంటుందీ?

కాని ఆకుర్రాడి స్వర్గసౌఖ్యం తనఅరిచేతిలోఉంటే అది అతనికివ్వటం ఉచితమా, కాదా? తన ధర్మమా, కాదా? బి. ఏ. పాసయిన తనకు నిరపాయకరమైన ఒక చిన్నతప్పు చేసే అధికారంఉందా, లేదా? ఒకవేళ తను ఆకుర్రాణ్ణి విరహాగ్ని వాతవేసి తనుపదహారణాల పాతివ్రత్యం దక్కించుకున్నప్పటికీ, ప్రపంచం తనపదహారణాల పాతివ్రత్యంలో విశ్వాసం ఉంచుతుందనే ఆశఉన్నదా?

* * *

"ఏమిటి, శాస్త్రీ, ఏదోఅనబోయినావే! నే నేమీ అనుకోనులేచెప్పు!" అన్నదిశారద ప్రోత్సాహకరంగా నవ్వుతూ.

అయిదునిమిషాలనించీ నీళ్లునములుతున్న శాస్త్రి పెదిమలు నాక్కుని అధికసాహసంతో నోరువిప్పాడు—

"ఈనెల ఇంతవరకూ మానాన్న డబ్బుపంప లేదు. పది హేనురూపాయిలు కావాలి. అడగటానికి సిగ్గుగా ఉంది!"

——

# పరస్త్రీ

[బుల్లికథ]

మాఆఫీసులో చిన్నఉద్యోగం కాళీపడింది. కొండలరావు జబ్బుచేసి మంచాన పడ్డాడు. ఒక నెలరోజుదాకా లేచే ఆశ లేదని డాక్టరు చెబితే అతనికిబదులు పనిచెయ్యటానికి సుబ్రహ్మణ్యం అనేఅతను గుంటూరునించి భార్యాసమేతంగా దిగాడు. నెలరోజులభాగ్యానికి కాపరం దేనికో? ఇక్కడ సంపాయించే నాలుగుడబ్బులూ రైలుచార్జీక్రిందధారపొయ్యటానికికాకపోతే!

సుబ్రహ్మణ్యం ఆఫీసుకుసమీపంలోనే ఒకపదిరూపాయల భాగం అద్దెకు తీసుకుని అందులో కాపరం పెట్టాడు. సుబ్రహ్మణ్యంభార్య చాలా అందగత్తె. పరాయివాళ్లతోకూడా కలుపుగోలుగా మాట్లాడుతుంది. మా ఆఫీసులో చాలా మందిమి సుబ్రహ్మణ్యగారింటికివెళ్లి కాసేపుకూర్చుని వస్తూ ఉండేవాళ్లం.

నెలరోజు లెంతలోకి అయి పోతై? సుబ్రహ్మణ్యం ఉద్యోగం పూర్తికావచ్చింది. కాని కొండలరావింకా కోలుకోలేదు. అయితే, సుబ్రహ్మణ్యం మాత్రం నెలపూర్తికాగానే భార్యనుకాస్తా పంపిరచేసి హోటలుభోజనం ప్రారంభించాడు.

ఇంతలో కొండలరావు కాస్తా గుటుక్కు మన్నాడు. సుబ్రహ్మణ్యానికి నౌఖరీ ఖాయపడ్డది.

“నీభార్యనుమళ్లా ఎప్పుడు తెస్తావోయ్?” అని సుబ్రహ్మణ్యాన్ని ఆఫీసుపాతీ అడిగాం.

'తెస్తాను తొందరేం?' 'అసలు తీసుకునే రాను!' 'ఉత్తరం రాద్దామని చూస్తున్నాను!' 'ఎవతెనన్నా పెట్టుకుని ఓ నెల కాలక్షేపంచేసి తర్వాత తెద్దామనుకుంటున్నాను!' ఈవిధంగా ఒకడికి చెప్పినట్లు మరొకడికి చెప్పకుండా సమాధానాలు చెప్పాడు సుబ్రహ్మణ్యం.

మా ఆఫీసులోనే పనిచేసే భగవాన్లుకూడా ప్రస్తుతం సుబ్రహ్మణ్యంఇంట్లోనేచేరినట్టు తెలిసింది. ఇంకేం? ఈఇద్దరూ కలిసి ఎవతెనో పెట్టబోతున్నారని పుకారుపడింది.

"నాభార్య ఎల్లుండివస్తుంది;" అన్నాడుసుబ్రహ్మణ్యం.

"భగవాన్లు?" అన్నాం.

"వాడూమాఇంట్లోనేఉంటాడు"అన్నాడుసుబ్రహ్మణ్యం.

ఆరోజే ఎవరో వెళ్లి సుబ్రహ్మణ్యం ఇంటివాళ్లతో ఊదొచ్చారు—ఇంటోఉన్న ఇద్దరూ ఎవతెనో తెచ్చిపెట్టబోతున్నారు గనక తక్షణం వాళ్ళని వెళ్ళగొట్టమని.

ఇంటివాడు సుబ్రహ్మణ్యానికీ భగవాన్లకీ నోటీసిచ్చాడు.

"రెండోనెల ఆఖరయిందాకా లేవను, నువ్వు ప్రీవీకౌన్సిలుకుపోయినాసరే!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

త్వరలోనే ఆముండ వచ్చింది—వట్టి పాపిష్టి మొహమూ అదీనూ! దాన్ని చూస్తేనే మాకందరికీ రోతపుట్టింది. చక్కని భార్యానుపెట్టుకుని వీడి కిదేంపొయ్యేకాలమా అని నేను అనుకున్నాను.

ఆమనిషి వచ్చినతరవాత ఒకపూట ఉండి. భగవాన్లు కూడా ఆ ఇల్లువదిలి వేరేగదిచూసుకున్నాడు,బుద్ధిమంతుడు.

ఇంతలో ఒకనాడు మాఆఫీసుకొక పెద్దమనిషివచ్చాడు—

"సుబ్రహ్మణ్యం ఉన్నాడా?" అంటూ. మేమడిగిన మీదట ఆయన సుబ్రహ్మణ్యం పినమామగారని తెలిసింది.

"ఇంకా సుబ్రహ్మణ్యం రాలేదు. వచ్చే వేళఅయింది... సరేగాని మీ పిన్నల్లుడు ఎవతెనో పెట్టుకుని ఉంటున్నాడు. పెద్దవారు మీరన్నా చెప్పరాదా?" అని నేనన్నాను.

"ఎవతెనో పెట్టుకుని ఉండటమేమిటి, నీ మొహం! అది వాడి పెళ్లామే! నేనిప్పుడేగా వాడింటికి వెళ్లివస్తున్నదీ? వాడింటోనూ లేడు; ఏమైనాడో..." అని గొనుక్కుంటూ ఆ పెద్ద మనిషి వెళ్లిపోయినాడు.

---

## రెండో పెళ్లి

[గల్పిక]

157533

శాపాచలంగారు ముప్ఫైతొమ్మిదో ఏట పదేళ్ల పిల్లని రెండో పెళ్లి చేసుకున్నాడు. ముప్ఫైతొమ్మిదేళ్లవాడికి పెళ్లాం అవసరమనేది శాపాచలంగారంగీకరించాడు గాని తనకన్న ఇరవైతొమ్మిదేళ్లు చిన్నదైన పెళ్ళాం ఆయనకు తృప్తికరంగా లేదు. తనకు ముప్ఫైపళ్లకన్య ఎట్లా దొరుకుతుందీ? దొరికితే మటుకు పెళ్లాడితే నలుగురూ ఏమంటారు? పోనీ. పెళ్లి చేసుకోకుండా ఉందామూ అంటే ఇతర విషయాలట్లాఉంచి తనకిన్ని నీళ్లు వదలటానికన్నా లేరే!

తీరా పెళ్లిఅయింతరవాత ఆలోచిస్తే నలుగురూ బలవంతాన తన పెళ్ళి చేసినట్టుగా తోచిందాయనకు.

TL
035,3NKR,K
35N45

"ఇంకా నలభై కూడా రాలేదుగా?'' అన్నారుకొందరు, ఇంకో సంవత్సరంలో తనకు వివాహ యోగ్యత లేకుండా పోయేట్టు.

''నీకు బుద్ధిఉందా! నీకన్న ముప్ఫయేళ్లు చిన్నపిల్ల నేమని పెళ్ళాడావు!'' అన్నవాడు లేడు. రేపటినించీ ఆ మాట అననివాడూ ఉండడు.

పెళ్ళికిఎదిగిన పిల్లలు రెండు జాతులుంటే బాగుండును-తనకు ఈడయినవారిని చేసుకోదగినవాళ్లూ, ముసలి వాళ్లను మాత్రమే చేసుకోదగినవాళ్ళూ అంటూ! ఒక పిల్లకు చిన్న మొగుడే దొరుకుతాడో పెద్ద మొగుడే దొరుకుతాడో నిర్ణయించటానికి లేకపోవటం దారుణం.

లేదా చిన్నపిల్లల ఆటల్లో 'దొంగ' అనే మనిషిని నిర్ణయించటానికి కొన్ని నిబంధనలు పెట్టినట్టు, పెద్దవాళ్లకు చిన్నపిల్లల్ని అంటగట్టటానికికూడా కొన్నినిబంధనలువెడితే? తన పెళ్ళాన్ని ఏ డెబ్భయ్యేళ్ళ మొగుడికో ఇవ్వాలని శాసనం జరిగిఉండి ఆమీదట తను—నలభైకూడా లేని వాడు—మొగుడైతే ఎంత సంతోషించేది!

ఆడవాళ్లెంతలోకి ముసలాళ్లవుతార్లే? ఇద్దరి పిల్లల్ని కంటే తనభార్య మరోపదేళ్లలో అవ్వ అవుతుంది.

శాషాచలంగారనుకున్నట్టే పార్వతమ్మ ఇరవై ఏళ్లయినా రాకపూర్వమే ఇద్దరుపిల్లల్నికని నేవళం పోగొట్టుకొన్నది. ఆదంపతుల వయస్సులో తేడాగమనించటంకూడా మరిచారు ప్రజలు. చిన్నపిల్ల మొగుడుకావటంవల్లనో ఏమో శాషాచలంగారి పదిసంవత్సరాల కాలంలోనూ ఏమీమార లేదు—

తెల్ల వెంట్రుకలు జాస్తికావటంతప్ప.

ఇంకో ఇరవై ఏళ్లు గడిచినై. శాస్త్రాచలంగారు రాయుల్లే ఉన్నాడు. ఒక చత్వారంలేదు, పల్లుకదలటంలేదు, నడుము నొప్పిలేదు, చెవుడులేదు. పార్వతమ్మ అప్పుడే రెండుదంతాలు పీకించి కళ్లజోడుపెట్టింది. ఆవిడతలకట్టు జనపనారపాళానికి వచ్చేసింది.

శాస్త్రాచలంగారు తన వివాహంగురించి ఒకప్పుడు పడ్డ దిగులంతా పూర్తిగా మరిచాడు.

వాళ్ల పెద్దబ్బాయి బి. యే. పాసయి, ఉద్యోగం సంపాదించి పైకొస్తున్నాడు. వాడుకథలూఅవీ రాస్తున్నట్టూ, వాటిని నలుగురూ బాగున్నవంటున్నట్టూ విని శాస్త్రాచలంగారు సంతోషించారే, కాని ఆకథలేవీ తను మాత్రం చదవలేదు.

ఒకనాడు అబ్బాయి ఇంటో లేనిసమయంలో పోష్టు బంట్రోతొచ్చి ఒకపత్రికపడేసి పోయినాడు. శాస్త్రాచలంగారు పరధ్యానంగా పత్రికవిప్పి పేజీలుతిప్పుతుంటే కుమారుడిపేరు కళ్లపడ్డది. ఆయన చిరునవ్వు నవ్వుకుంటూ చదవ నారంభించాడు. కథపేరు 'మాతాత'. అబ్బాయికి మంచి ఉహాజ్ఞానం ఉండిఉండాలి. లేకపోతే వాడే తాత నెరుగును గనుకా?

చదువుతున్నకొద్దీ శాస్త్రాచలంగారి మొహం పాలిపోయింది. అబ్బాయికథలో తాత మూడు మూర్తులా శాస్త్రాచలంగారే!

---

# ఒక ప్రణయ కధ

[గల్పిక]

మావాడి ప్రణయ కథలో నేను జోక్యం కలిగించుకోకుండా ఉండాలని చాలా ప్రయత్నించాను. కాని సూర్యమే నన్ను బలవంతంగా అందులోకి లాగాడు; నెలరోజులు ఆలోచించి మరీ రాసిన తన ప్రణయలేఖ చూపించాడు:

"కమలా, నన్ను వివాహం చేసుకొనటానికి నీ కేమన్నా అభ్యంతరం ఉందా?

'నీకీ ఉత్తరం రాయకుండా ఉండాలని నెల్లాళ్ళనించీ ప్రయత్నిస్తున్నాను. లాభం లేకపోయింది. నిన్ను కోరకుండా ఉండాలని నేను చేసిన ప్రయత్నమంతా వృథా అయిపోయింది.

"నన్నే అడిగితే, నాకన్న అన్ని విధాలా మంచి వాణ్ణీ, అందమైనవాణ్ణీ, ధనికుణ్ణీ, తెలివి గలవాణ్ణీ, పెళ్ళాడమని సలహా ఇస్తాను—సూర్యం."

"ఎట్లా ఉంది ఉత్తరం?" అన్నాడు సూర్యం.

నేనాలోచించి, "నీలాగే ఉంది. పోస్టులో వేసిచూడు." అన్నాను.

దానికి వచ్చిన సమాధానం కూడా మావాడు నాకు చూపాడు. నన్నా జవాబు పైకి చదవమన్నాడు.

"సూర్యంగారూ, మీ ఉత్తరం గురించి ఏమనుకోవాలో నాకు తెలీదు. నన్ను మీరవమానం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నట్టు భావిస్తున్నాను. మీరింకా మంచిగా, అందంగా,

ధనికులుగా, తెలివిగా లేనందువల్ల మిమ్మల్ని పెళ్ళాడలేను-
కమలాదేవి.''

నేనా ఉత్తరం పూర్తిచెయ్యగానే సూర్యం విరగబడి నవ్వసాగాడు. వాడికి మతి చెడిందని నా కనుమానం తగిలింది. ఎందుచేతంటే వాడు కమలను ప్రేమించాడు, తన ప్రేమను విమర్శించుకున్నాడు, దాని బలాన్ని పరీక్షించి, అది గట్టిప్రేమే నని నిర్ణయించుకున్నాడు. అట్లాంటి ప్రేమ ఇట్లా పరిణమించినందుకు నాకు విచారం వేసింది.

నేను వాడిభుజంతట్టి, ''ఫరవాలేదులేరా, ఓ నెల్రోజుల్లో నువ్వా అమ్మాయిని మరిచిపోతావు—కాస్త ప్రయత్నిస్తే'' అన్నాను.

వాడింకా నవ్వసాగాడు.

''ఆ పశువునా?'' అన్నాడు నవ్వుతూనే ''దానికోసం నెల్రోజు లకారణంగా హైరానుపడ్డాను. చెప్పుతో కొట్టక సముదాయిస్తావేం?''

నా గుండెమీది బరువు తీసేసినట్టయింది.

తరవాత రెండు నెల్లకు కాబోలు కమల వివాహం అయింది. ఆమెభర్త కొత్తగా ఐ.సి.ఎస్. పరీక్ష పాసయి ఎక్కడో డిప్టీకలెక్టరుగా ప్రవేశించాడు. చూపులకు దొరల్లేనే ఉంటాడు.

మా సూర్యంలో కలిగినమార్పు నేను నాలుగైదు రోజుల అనంతరం గాని గమనించలేదు. వాడాహార నిద్రలు విసర్జించాడు. వాడి నవ్వు విని ఎన్నో సంవత్సరా లయినట్టుంది. వాణ్ణి చూస్తేనే భయం వెయ్యసాగింది.

"ఏమిట్రా, సూర్యం?" అన్నాను.

"ఆ కమల—" అన్నాడు.

"ఆ కమలమీద నీకు మళ్ళా వ్యామోహం కలిగిందా ఏమిటి?" అన్నా ఆశ్చర్యంతో.

సూర్యం తల అడ్డంగా తిప్పాడు.

"కమల అన్నమాట నిజం. ఆ ఉత్తరం రాసి నేనావిణ్ణి అవమానించాను."

"అప్పట్లో నువ్వట్లా అనుకోలేదే!"

"అప్పటికది అవమానం కాదు. ఈ పెళ్ళివల్ల అది అవమానంగా పరిణమించింది."

"ఎట్లా?"

"కమల కెటువంటి మొగుడు దొరికాడో చూడు! కమలని ప్రేమించటానికి గాని ప్రేమించానని చెప్పి ఉండటానికి గాని నాకే మధికారం ఉంది?"

"కమలను పశువన్న వాడివి కాదూ?"

"అప్పుడు—నాకు సమాధానం రాసినప్పుడు కమల పశువే!"

సూర్యానికి నిజంగా పిచ్చి ఎత్తిందనే ఇప్పటికీ నా విశ్వాసం......

# కురూపి

[గల్పిక]

ఆవిడ అనాకారి కాదుకాని బక్క—చిక్కి—న మనిషి. దవడలు బొత్తిగా అంటుకుపోయినై. కళ్లు విశాలమైనవైనా లోతుకు పోయినై. రొమ్ము ఎండిపోయింది. కాళ్లూ చేతులూ ఊచలే, నడుముకూ పిరుదులకూ వ్యత్యాసం లేకుండా ఒకటో అంకె లాగా ఉండేది.

ఆవిడభర్త తన ఈడువాళ్లనీ, తనకంటెచిన్నవాళ్లనీ, తన కంటె చాలా పెద్దవాళ్లనీ అనేకమందిని చేరదీసేవాడు. నిత్యమూ వారింటికి వస్తూఉన్నవారిలో అతను చాలా అంద గాడు. కుర్రవాడు. పాతికేళ్లు వెళ్లినవో లేవో. అతని దర్శనం ఏ ఆడదానికన్నా ఆనందం ఇవ్వగలగవచ్చు.అతను తనకేసి నవ్వితే ఏ ఆడదీ మరవలేదని పిస్తుంది.

అతనికి ఒకరిద్దరు ఆడవాళ్లతో సంబంధం ఉన్నట్టు ఆమె విన్నది. అందుచేత అతను బొత్తిగా ప్రవరు డనుకోవలిసిన అవసరంలేదు.

తన పరిశోధనకోసం ఆమె ఆ కుర్రవా ణ్ణెన్నుకుంది.

ఆమె తనకేసి వింతగా చూడటం అతను త్వరలోనే గమ నించాడు. అతనికి కొత్తలో అసహ్యంవేసింది. ఎండిపోయిన ఆవిడ రొమ్మూ, నరాలుతేలిన ఆవిడ పొడుగాటి మెడా స్మరించుకుని నవ్వుకున్నాడు.

నాలుగైదురోజులు గడిచినతరవాత అకస్మాత్తుగా అతని హృదయంలో ఒకభావం మెరిసింది—ఆవిడ సన్నతనంలో

ఎంత నాజూకున్నది!

ఇటువంటి ఆలోచన కలిగినందుకతనికి ఆశ్చర్యం వేసింది. తను ఆ శవంలో ఏదో మంచి చూడగలగటం ఏమిటి? పుష్టి అయిన వక్షమూ, నిగనిగలాడే తొడలూ, కంఠమూ, పాలు గారే చెక్కులూ ఎరిగినతను——!

కాని ఆమె సన్నదనంలో ఏదో నాజూకు-సౌకుమార్యం——ఉన్నదనే ఆలోచన అతని తలలోనించి పోలేదు. పైగా మరింత ధృడం కాసాగింది.

ఒకనాడతను ఆమెకళ్ల కేసి చూశాడు. అతని కప్పటి వరకూ ఆడవాళ్లకళ్లల్లో తేడాలు తెలీవు. ఈకళ్లెంత అగాధంగా ఉన్నై! ఇతరుల కళ్ళల్లో ఏముంది? కనురెప్పలూ, కనుగుడ్లూ, నల్లగుడ్లూ, పాపం! ఈకళ్ళల్లో బ్రహ్మాండం తాలూకు రహస్యమంతా ఉంది!

ఆరోజల్లా అతని కాకళ్లు జ్ఞాపకం వస్తూనే ఉన్నై.

మరోరోజు ఆమే, ఆవిడభర్తా, అతనూమాత్రమే ఉన్నప్పుడు ఒకమాట అన్నది.

"ప్రేమలూ, గీమలూ చెప్పకండి. ఒకటే ప్రేమ ఉంది ప్రపంచంలో——పరమకురూపికి నవమన్మథుడిమీదా, నవమన్మథుడికి కురూపిమీందా కలిగే ప్రేమ! అది అంటుకుంటే చల్లారదు. ప్రపంచాన్ని భస్మం చేస్తుంది. మిగిలిన ప్రేమలన్నీ ఇస్తిరివాయినం, పుచ్చుకుంటి వాయినం!"

అతను దద్దరిల్లిపోయినాడు, నాలుక పొడారింది. ఆమె భర్తకేసి చూశాడు.

ఆమెభర్తకూడా విస్మయపడ్డవాడల్లే మిగిలిన ఇద్దరికేసి

రెండుసార్లుచూసి పెద్దపెట్టున నవ్వాడు.

ఆవిడ తనచేతివేళ్ళకేసి చూసుకుంటూ నిశ్చలంగా కూచుంది.

అతని కారోజల్లా ఇంకో ఆలోచనేలేదు. ఆమెను ఒక్క-క్షణంకూడా మరవలేనట్టయింది. ఆమె చెప్పింది నిజం. ప్రేమతో పోలిస్తే కామం ఏపాటిది? ఎంత గోరు వెచ్చనిది! ఆమె తనను ప్రేమిస్తున్నది. తను ఆమెను ప్రేమించకుండా ఉండటం అసంభవం! గోగుపుడకలాటి ఆమెశరీరంలో రక్తం కాదు, అగ్ని ప్రవహిస్తున్నది. తను అదివరకెరిగిన ఆడవాళ్లు నీళ్ళకుండలు! అరటి బోదెలు! ఆవిడ హాలాహలం! అదే కావాలి తనకు.

ఆరాత్రి అతనికి ఆలస్యంగా నిద్రపట్టింది. కలవచ్చింది. ఆమెవచ్చి తనసరసనే పడుకుంది. ఆమెచేతులు తనచుట్టూ వెయ్యగానే తనశరీరంలో విద్యుత్తు ప్రవహించింది. ఆమె మొహానికేసి తనమొహం అదుముకుంటేగుచ్చుకున్నది.ఆమె కళ్ళల్లోకి చూస్తే గాఢాంధకారం, ఆగుడ్లల్లో ఏమీలేదు. మొహం వెనక్కు-లాగి చూచునుగదా తనపక్క-న పడుకుని తనచుట్టూ చేతులువేసినది మనిషి కాదు—అస్థిపంజరం...

మర్నాడు అతను నూరుడిగ్రీల జ్వరంతో ఆమెను చూడ బోయినాడు. "నిన్నువిడిచి బతకలేను. నన్నుచంపకు. నువు నాదానివైతే నేను మరుక్షణం చావటానికైనా లెక్క-చెయ్యను," అని మనస్సులో ఆవిడతో అంటూ ఇంటో ప్రవేశించాడు,

ఆమె ఒంటరిగా ఉంది. అతనిజ్వరం మరో రెండుడిగ్రీలు

పెరిగింది. అతనినోరు స్వాధీనం తప్పింది. మహత్తరమైన శక్తి ఏదో తనని ప్రేరేపిస్తున్నట్టుగా అతను ఆమె పక్కనే కూర్చుని బెండువంటి ఆమెశరీరాన్ని దగ్గిరికి తీసుకుని కండ లేని ఆమెమూతి ముద్దుపెట్టుకున్నాడు. అతని మొహాన చెమట కాలవలు కడుతున్నది.

ఆమె ఈప్రణయ ప్రదర్శనానికి కంగారుపడ లేదు. చిరునవ్వు నవ్వి, "చాలు, చాలు! నా అభిప్రాయం ఇదికాదు. మావారికి నన్నుచూస్తే ఒక దురభిప్రాయం! నే నెవ్వరికీ అక్కర్లేదని! నన్ను వీధిలోపారేస్తే నల్లకుక్కయినా ముట్టదని! ఈయన పొరపాటుపడ్డట్టు కనిపిస్తుంది! ఆవిషయం నిన్నడిగి అనుమానం రహితం చేసుకుందామనుకుంటుండగా, దేవుడల్లేవచ్చి నువ్వే నా అనుమానం తీర్చావు. నన్ను బాధించకు. నాకు మావారిమీదతప్ప మరెవ్వరిమీదా భ్రమ లేదు!" అన్నది.

# నమ్మదగినమాట

[గల్పిక]

గోపాలానికి కొక పెద్ద ధర్మసందేహం పట్టుకుంది—ఆసినిమా ట్రూపులో బొంబాయి వెళ్ళిన తన తమ్ముడు పార్వతీశం ఎవతెనన్నా తగులుకున్నాడా, లేదా?

తన తమ్ముడి నైతికక్షేమంతో గోపాలాని కేం పనో ఊహించటం కష్టం. తమ్ముడు ఎవతెనన్నా తగులుకున్నాడని ఋజువైతే తన కెక్కువ తృప్తో, నీతిగా ఉన్నాడంటే ఎక్కువ తృప్తో గోపాలానికే తెలీదు.

గోపాలానికి ఒక్కటే తెలుసు: పార్వతీశాన్ని తను పెంచి పెద్దవాణ్ణి చేశాడు, చదువు పూర్తిగా చెప్పించాడు; ఒకఇంటి వాణ్ణి చెయ్యటం మాత్రమే తనమీాద ఉంది. ఈపరిస్థితుల్లో పార్వతీశం ఇప్పుడే కోతికళలు పోవటం జరిగితే, ఏనిక్షేప మంటి పిల్లనో తెచ్చి వాడికంట గట్టటం తనవల్ల ఒక్కనాటి కూ్కడా జరగదు!

తన తమ్ముడిమీాద కంటె, గోపాలానికి, ఆతమ్ముడికి ముడి పెట్టబోయే పిల్లమీాద ఇంత అభిమానం దేనికో అదికూడా మనం సులభంగా ఊహించలేం.

ఏమైనా పార్వతీశం ప్రవర్తనను గురించి స్పష్టంగా తెలుసుకునేదాకా గోపాలానికి నిద్రపట్టే లక్షణాలు కనిపించలేదు.

అసలేసినిమాకంపెనీ! అందరూ లఫూటుగాళ్లు చేరతారు. ఆపైన ఆడవాళ్లూ మగవాళ్లూ కలిసి చైతక్కలాట్టం! ఆముండ లన్నా సంసార్లా అంటే—సంసార్లు హాయిగా మొగుళ్ళకు

వంటచేసిపెడుతూ పిల్లల్నికనక సినిమాల్లో కెందుకుపోతారు?

పార్వతీశం వెంట తమగ్రామంనించి ఇంకా అయిదారు గురు వెళ్ళారు. అసలా సినిమా తీసినకంపెనీ ఆవూరివాళ్ళదే. అందుకని గోపాలం నలుగురిదగ్గిరా ఆరా తియ్యటానికి బయ ల్దేరాడు.

"ఏమోయ్, లక్షీనారాయణా? నువ్వుకూడా బొంబాయి వెళ్ళావుగామల్లు. ఏమిటి కబుర్లు? మాతమ్ముడు, పార్వతీశం, ఒళ్లుదగ్గిరపెట్టి మసులుకున్నాడా?" అన్నాడు గోపాలం.

"వాళ్లు ఎవరిదగ్గిర పెట్టి?" అన్నాడు లక్ష్మీనారాయణ విచక్షణగా.

తాగుబోతు వెధవ! వాణ్ణి అడగటం తనదేపొరపాటు!

"ఏమండీ, కృష్ణశాస్త్రిగారూ?మీరంతాకలిసే ఉన్నారు గానూలు. మాతమ్ముడు, పార్వతీశం, ఆడవాళ్లజోలికేమీ పోలేదుకద?"

"ఎబ్బే.అటువంటిదేమీ ఉన్నట్టు లేదులెండి.నాకతనితో ఆట్టే పరిచయం కలగలేదుగాని—వస్తాను!"

ఎందుకు చెబుతాడూ? అంతా తోడుదొంగలు!

"ఏమోయ్, సూర్యం మావాడు బొంబాయిలో ఛటా చోరుముండల్నెవర్నీ తగులుకోలేదుగద?"

"ఓరహస్యం చెప్పనా? మళ్లీ ఎవరితోనన్నా అనేరు! నేను తలుపుకంతల్లోనించి చూశాగాని,నాకేమీకనిపించలా, చీకట్లో! తెలీనిమాట చెప్పి ఎట్లా పాపం కట్టుకునేదీ!"

వీడో దొమ్మర ముండాకొడుకు! చిన్నంతరమూ పెద్దం తరమూ ఎరగడు!

ఇంత శ్రమపడి ఆముండదగ్గిరికిపోయి అదేమంటుందో ఆ సంగతికూడా తేల్చుకొంస్తే సరిపోతుందిగా!

గోపాలం ప్రాణా లరిచేతిలో పట్టుకొని దానిఇల్లు విచారించుకుంటూ వెళ్లాడు.

పొద్దూకిం దప్పుడే. "కూర్చోండి, పంతులుగారూ?" అంటూ అది తనఎదటే చీరవిప్పి మరోచీర కట్టసాగింది.

"అయితే—ఇదుగో—చూడూ! నీపేరేమిటో? మీా వెంట పార్వతీశమని ఒక కుర్రాడొచ్చాడే! వాడు మీాతో వచ్చిన ఆడవాళ్ళ నెవర్నన్నా మరిగాడా?"

"ఆ అబ్బాయి అటువంటివాడయితే నేనొదిలిపెడతానుటండీ, పంతులుగారూ?... వెళుతున్నారేం? రాత్రికుండరూ?"

అదురుతున్న గుండెతో గోపాలం బయటపడ్డాడు. తన తమ్ముడిశీలం చెడలేదని రూఢిఅయిందిగాని, అందువల్ల కలగదగిన సంతోషంమాత్రం గోపాలానికి కలగలేదు.

———

# కు ల ట

(గ ల్పి క)

"నీభార్యా మహాపతివ్రత అనుకుంటున్నావుగామాలు. నీ మొహం ఎరక్కమునుపు అదినాదగ్గిరికి ముప్పైమూడుసార్లు వచ్చింది. కాదనమను."

సంతకం లేదు.

అతను సావధానంగా ఉత్తరం చించేసి దీర్ఘాలోచనలో పడ్డాడు.

ఇది ఎవడికీ జరగరాని అనుభవం. మామూలు మనిషి దీనికి తట్టుకోలేడు. పిచ్చివాడై పోతాడు. తను పిచ్చివాడై పోరాదు.

ఆ ఉత్తరంలో ఉన్నవిషయం నిజమేఅయి ఉండవచ్చు. నిజమనినమ్మే కర్తవ్యం ఆలోచించాలి.

అది రాసినవాడు తనమీది ప్రేమచేత రాయలేదు. తన భార్యమీదా తనమీదా కూడా పగతీర్చుకోనేటందుకు రాశాడు. అంతవరకూ తనూ తనభార్యా ఒకేపక్షం.

తను తనభార్యను చాలా గాఢంగా ప్రేమించాడు.

తనుఎరిగినంతలోఏభర్తాభార్యకివ్వనంతస్వేచ్ఛఇచ్చాడు.

అది దుర్వినియోగపరిచి ఆమె తన్నెప్పుడూ చులకనగా చూడలేదు.

ఆమె తనను ప్రేమించింది. ప్రేమించని మనిషి తనకేసి అట్లాచూడలేదు. సంవత్సరంనించీ కాపరంచేస్తున్నా తమ ప్రణయం మెరుపు మాయలేదు. తనమీద ప్రేమలేకపోతే

తను కనిపించగానే పుష్పం వికసించినట్టు ఎట్లా వికసిస్తుంది? తనని చూసుకుని అంత ఎందుకు గర్విస్తుంది?

తనూ అదివరకు—పెళ్ళికాకపూర్వం—తనకన్న నాలుగేళ్లు పెద్దదైన ఆడదాన్ని ఎరుగును. తను ప్రణయానుభవం పొంది ఉండటం లాభించింది.

తన భార్యకూడా అంతేనేమో!

ఈవిషయం తను భార్యతో చర్చించాలా, వద్దా?

తను ఏ చర్యా తీసుకోకపోతే ఆఉత్తరం రాసినవాడూరుకుంటాడా?

కులట అని దేశమంతా చాటుతాడు! కులటను పెట్టుకుని కాపరంచేస్తున్న అపఖ్యాతి భరించటం తనకు అసంభవం.

ఇటువంటి భార్య మరొకతె తనకు దొరకదు.

ఆఉత్తరం రాసినవాడి ఓర్చలేనితనానికి తను అనుభవించే శిక్ష—తను ఈభార్యను పోగొట్టుకోవటం.

అతనింటికిరాగానే తల దువ్వుకుంటున్న భార్య చేతులో, జడవిడిచేసి అతని కెదురొచ్చి గట్టిగా వాటేసుకుని మొహం పైకెత్తింది.

కొంచెం అనుమానించి అతనా మెనుముద్దుపెట్టుకున్నాడు. ముద్దు రుచించలేదు. ఇక ఎప్పటికీ ఇంతేనేమో!

"అట్లా ఉన్నారేమండీ?" అన్నది అతనిచొక్కాపట్టుకుని పసిపిల్లల్లే లోపలికి నడుస్తూ.

గదిలో పందిరి పట్టెమంచం చూడగానే అతనునిలువునా నీరైపోయినాడు.

తనకేసి వింతగా చూస్తున్న భార్యను గాఢంగా—ధృత

రాష్ట్రుడు ఇనపభీముణ్ణి వాటేసుకున్నట్టు–వాటేసుకున్నాడు. ఆమెను పసిపిల్లను ఎత్తినట్టు రెండుచేతుల్లోనూ ఎత్తి మంచం మీదపడేసి తన మొహం ఆమె వక్షానికి గట్టిగా అదుముకున్నాడు...

ఆ ఉద్రేకపు ఉప్పెన తీరిపోగానే అతను మరో మనిషి అయినట్టయింది.

"రాత్రిబండికి మీవాళ్ళింటికి పంపేస్తున్నాను! త్వరగా వంటచెయ్యి" అన్నాడతను.

ఆమె తనకేసి చూస్తున్నదని అతనెరుగును. కాని ఆమె కేసి చూడలేకపోయినాడు.

ఆమె తనని ఎందుకనిగాని ఏమిటనిగాని అడగలేదు.

ఏమైనా సంశయం ఉంటే రూఢి అయిపోయింది.

"బండికి వేళౌతున్నది?" అన్నాడతను మరికొంతసేపటికి.

"ఇవాళవద్దు. రేపు వెళతాను. తప్పక వెళతాను" అన్నదామె దీనంగా.

"నీయిష్టం! మరో వాయిదా మాత్రం వెయ్యకు!"

తను భోంచేసి పడుకున్నాడు. ఆమె భోంచేసి వచ్చింది. కళ్ళుమూసుకుని నిద్రపోతున్నట్టు నటించాడు. ఆమెవచ్చి తేలికగా తన పక్కమీద కూర్చున్నది.

గంట గడిచింది. ఆమె ఇంకా కూర్చునే ఉంది, ఏంచేస్తున్నది? తనకేసి చూస్తున్నదా? ఏంచూస్తుంది? తను మేలుకున్నట్టు తెలిసి ఇదోఎత్తు వేస్తున్నదా? కళ్ళు తెరిచాడు.

ఆమె చప్పున మంచంమీదినుంచి లేచింది.

"ఏమిటి?" అన్నాడు.

ఆమె మళ్లీ అతనిపక్కనే కూర్చునే, "నన్నొకసారి కావిలించుకోండి. ఇందాకటల్లే!" అన్నది.

అతనిచేతుల్లో బలమే ఉన్నట్టులేదు.

అతనికి మూడింతలు బలంతో ఆమే అతన్ని కావలించుకున్నది.

"ఒక్కముద్దు పెట్టండి!"

ఆమెనోరు సన్నిపాతరోగి శరీరమల్లే కాలిపోతున్నది.

ఆమె భర్తను విడిచి ఎడంగాపోతూ, "లాభంలేదు. బతికున్నాళ్ళూ చెయ్యాలిసినపని ఒక్కక్షణంలో చెయ్యటం అసంభవం;" అన్నది.

అతని కర్థంకాలేదు.

ఇదంతా తనని మస్కా వెయ్యటం! అమ్మో, ఆడదానిఎత్తు!

పన్నెండు గంటలవేళ అతనికి కలతనిద్రపట్టింది. ఆమెమళ్లీ అతనికేసి చూడలేదు.

అతనికి తిరిగి మెళుకువచ్చేటప్పటికి ఎక్కడో కోడి కూస్తున్నది.

ఆమె పక్కమీద లేదు.

ఆమెకోసం గంటసేపు చూశాడు. రాలేదు.

అతనికి మళ్ళా నిద్ర పట్టింది.

మర్నాడుదయం బావిలో ఆమెశవం కనిపించింది.

———

# పాత పరిచయం

[గల్పిక]

తన్ను చూడ్డానికి వచ్చిన భాస్కరావును చూడగానే పార్వతి బుర్రలో ఏదో సంచలనం కలిగింది. అతన్ని పెళ్లాడాలని ఉందా, ఆడరాదనిఉందా తనమనస్సులో?

అతనికి దాదాపు 30 ఏళ్లుండవచ్చును. తనకు పధ్నాలుగో ఏడిప్పుడే ప్రవేశించింది! ఇద్దరికీ పదహారేళ్లు తేడా. ఇదేమన్నా తనను బాధిస్తున్నదా?

తనను బాధిస్తున్నది అదికాదని పార్వతి రూఢిచేసుకుంది. మరేమిటి?

"నీకిష్టమేనటే, అమ్మా?" అని తల్లడిగినప్పుడు పార్వతే మీ చెప్పలేకపోయింది. పిల్లసిగ్గుపడుతున్నదని తల్లిఅనుకుంది.

భాస్కరావు అందంగానే ఉన్నాడు. చలాకీగాకూడా మాట్లాడాడు. అతన్ని చూస్తే పార్వతికి ఏదో ఒకవిధమైన ఆనందం కలుగు తున్నమాట నిజమేగాని ఆ ఆనందం వెంట ఇంకేదోకూడా కలుగుతున్నది.

"ఏమిటది?"

పార్వతి అకస్మాత్తుగా ఉలికిపడ్డది. ఆమె ఆలోచనా ప్రయత్నం ఫలించింది. ఇతన్ని—ఈమొహం——తనుపూర్వం చూసింది. అయిదేళ్ళ క్రితం, బాపట్లలో.

బాపట్లలో ఆ వీర్రాఘువులుగారమ్మాయి ఉండేది. తన స్నేహితురాలు. వాళ్ళింటిపక్కనే ఆపంతులమ్మ ఉండేది. ఎంత బాగుండేదిపంతులమ్మ! కోపమన్నమాట లేదు. నవ్వుమొహం.

ఒకరోజు రాత్రి, తను వీర్రాఘవులుగారింటో పడుకున్నప్పుడు, తన స్నేహితురాలు, బాగా పొద్దుపోయిన వేళ, "నీకో తమాషా చూపిస్తారావే!" అని తనను పిలుచుకు పోయింది.

చప్పుడు చెయ్యకుండా పిల్లిలాగా అడుగులో అడుగు వేసుకుంటూ అది పంతులమ్మగారి దొడ్డివాకిలి వేపు దారితీసింది. తనకు గుండెల్లో రైళ్లు పరిగెత్తినై. దానికెంత ధైర్యం! తనకు ముందుకు పోబుద్ధి పుట్టకపోయినా పిరికిదనిపించుకోవటం ఇష్టంలేక ముందుకు సాగింది.

ఆతరవాత ఇద్దరూ తలుపు కంతల్లోనించి చూచారు!

ఆ దృశ్యం ఇంకా తనకళ్లముందాడుతునే ఉంది. ఆపంతులమ్మ చాపమీద కూర్చుని ఉంది. ఆమెపక్కనే పడుకుని ఉన్నాడు. ఆమెఒళ్లంతా ప్రేమగా తడువుతూ, మధ్యమధ్య ఆమెను తనమీదికి వంచుకుని చాలాచాలాసేపు ముద్దుపెట్టుకుంటూ—ఇతనే!

ఈ భాస్కర్రావే! ఈమొహమే! ఇదేజుట్టూ, కళ్లూ! అప్పుడు కొట్టుతున్నట్టే పార్వతిగుండె మళ్లీ కొట్టుకోసాగింది.

ఆపంతులమ్మమీద తనకప్పుడు కోపంవచ్చిందా, లేదా, పార్వతి తేల్చుకోలేకపోయింది.

ఆమనిషేతనభర్తా? తను ఇటువంటి పెళ్లికిఒప్పుకోగలదా? సమాధానం తెలీలేదు... ఆపంతులమ్మను ఎంత ఆపేక్షగా చూశాడూ!

"ఏమే, అమ్మా! మీఅమ్మ అడిగితే చెప్పలేదుటగా? కుర్రాణ్ణి చూశావుగా? నీకిష్టమైనట్టేనా?" అన్నాడుతండ్రి.

"నాకు తేలీదు, నాన్నా!" అని పచ్చి నిజంచెప్పింది

పార్వతి, పార్వతికి తన్నుచూస్తే తనకే మండిపోయింది. ఇత నాపంతులమ్మతో సరసాలాడటం కళ్లారాచూసికూడా తను ఎందుకు తేల్చుకోలేదూ?

పార్వతి కిష్టమైనట్టే భావించుకోబడింది.

లగ్గాలు పెట్టుకున్నారు. పార్వతి ఇంకా నిర్ణయానికి రాలేదు. పెళ్ళిరోజు వచ్చింది. పార్వతి ఆలోచిస్తూనే ఉంది. లగ్గం అయిపోయింది. పార్వతిమెళ్లో మూడుముళ్లూ పడినై.

"నన్నుకూడా అట్లానే ముద్దుపెట్టుకుంటాడు!" అనుకుంది పార్వతి. ఆమెరోమాలన్నీ నిక్కబొడిచినై.

అగ్నిహోత్రంముందు కూర్చునిఉండగా ఎవరో వచ్చి, "గోపాలం వచ్చాడురా!" అని పెళ్లికొడుకుతో అన్నారు.

భాస్కర్రావుచప్పున వెనక్కుతిరిగి, 'ఏడీరమ్మను!' అన్నాడు.

తనభర్త, గోపాలం అనేవాడికోసం అరనిమిషకాలంలో అయిదుసార్లు వెనక్కుతిరిగిచూడటం పార్వతి గమనించింది.

"ఏంరోయి, పెళ్ళికొడకా! ఏదీ మామరదలు?" అంటూ ఎవరో వచ్చి తనపక్కనే నిలబడ్డారు.

పార్వతి తలకాయ పైకెత్తి చూసింది.

అదేమొహం! అదేజుట్టూ, కళ్ళూ!

"వా! మంచిపిల్లను కొట్టేశావురా, తమ్ముడూ! నేనో అయిదేళ్లు చిన్నవాణ్ణయి ఉండగూడదూ?" అన్నాడు గోపాలం పార్వతికళ్ళల్లోకి నవ్వుతూ చూస్తూ.

"పెళ్లికూతురు కళ్లల్లోకి పొగపోతున్నట్టుంది, కాస్తనిప్పు విసర్రాదూ, పళ్లకొడకా?" అన్నదో ముసలి ముత్తయిదువు.

# నిజందాగదు

ఆమాట కనకానికి తెలియకపోలేదు—నిజం దాగదు. బయటపడితీరుతుంది. ఐతే మరి తను ఇప్పుడేం చెయ్యాలె? ఆ ప్రశ్నకు సమాధానం ఆలోచించలేక బాధపడసాగిందికనకం,

ఈపరిస్థితుల్లో మరొకతె అయితే ఏంచేసి ఉండేదోకాని ఆమెకుమాత్రం ఏఉపాయమూ తోచలేదు. వ్యవహారంఇంత దాకా వచ్చినతరువాత తను ఇప్పుడు ఏంచేసినా చిక్కే; ఏంచెయ్యకపోయినా చిక్కే!

ఇది ఇంకొకరిని సలహా అడిగేవిషయమైనా కాదు మరి. ఉన్నదంతా చెప్పేస్తే తనను ఎవ్వరూ క్షమించరు. కొంత మార్పుచేసి తనమీద ఏమీ నిందమోపటానికి వీలులేకుండా చెబితే నవ్వుతారు. ఏది దారి?

మొదట్లోనే—మొట్టమొదట్లోనే— తను ఒకవిధంగా ప్రవర్తించిఉంటే తనకీసమస్య తప్పిఉండేది అని అనటానికి కూడాలేదు ఖర్మం!

ఇదీ జరిగినసంగతి. పదిహేను రోజులకిందట వేసవిశెల వులకు ఇంటివారబ్బాయి ప్రకాశం పట్టణంనించి వచ్చాడు. అతను నాలుగురోజులకు వస్తాడనంగా అతని భార్య సౌభాగ్యం పుట్టింటినుంచి వచ్చింది. విశాలమైన కళ్ళూ, తళతళ మెరిసే చెక్కిళ్ళూ, అందమైన కోలమొహమూ, మహా నాజూకైన నడకా—సౌభాగ్యం మంచిఅందగత్తె. ఆపిల్లకూ తనకూ మంచి స్నేహమయిందీ, ఒకరినొకరు చూసుకున్న క్షణంనించీ.

సౌభాగ్యం భర్తకోసం ఆదుర్దాగా ఎదురుచూస్తున్నట్టు తనకు సులభంగా తెలిసిపోయింది. తానెంత అన్యోన్యంగా ఉండేదీ సౌభాగ్యం తనతో దాచకుండా చెప్పేసింది. తనూ, తనభర్తా కలిసి తీయించుకున్న ఫోటోలు నాలుగు చూపించింది తనకు. ఫోటోలోనే ప్రకాశం ఎంతో అందమైన వాడుగా కనిపించాడు. కాని చూడవలసింది అతని ఫోటోను కాదు—అతన్నే. రాజు—అతనిదగ్గిర చక్రవర్తులు కుండదగిన కళ ఉంది. అతని మాటల్లో కూడా అంతదర్జా ఉంది. అతనిచూపుకూడా భయం ఎరగని సూటి అయిన చూపు. కాని అందంలో కాఠిన్యంలేదు. చూపే ఇంత చేసింది.

వచ్చిననాడే ప్రకాశం తను బావిదగ్గర చెంబులు తోలుస్తుండగా స్నానం చెయ్యటానికి వచ్చి తనవంక ఆచూపు చూశాడు. వెంటనే తనకు మతిపోయి నట్టయింది. అతనికళ్లు పలకరించగలవు—అదేంచిత్రమో!—తననుపలకరించినై. ఎంతో సహజంగా, తప్పుచేస్తున్న భీతే లేకుండా!

ఆతరవాత ప్రకాశం తనవంక అట్లాగే చూస్తూవచ్చాడు. తన కేమనుకోవటానికీ తోచలేదు. సౌభాగ్యంవంటిభార్యను పెట్టుకొని అతను తనను చూడగానే మోహించా డనుకోవటం కష్టమైంది. అతను భార్యకన్న తనను ఎక్కువగా భావించటం అసాధారణ మైనప్పటికీ అసంభవం మాత్రం కాదు. ఐనా దీని అంతేమిటో కనుక్కోవాలనే తెగులు తనకు పుట్టింది—దాచటం దేనికీ?

ఆ తరవాత తను అవకాశం దొరికినప్పుడల్లా—మూర్ఖో వాడికి తెలియకుండా—అతనివంక తదేకదృష్టిగా చూడటం

గి చెయ్యటానికి తనులేని అవకాశాలు కూడా కలిపించుకోసాగింది, ఎవరైనా తెనమునన్ను పగల గోసిచూసి తప్పుపడతారని ఒక చెంప భయంగానే ఉండేది. కాని తను కొంత సాహసించింది. ఆ సాహసంవల్ల తన కేదో తృప్తికూడా కలిగేది.

ఇట్లా రెండురోజులు గడచినతరువాత ప్రకాశం కళ్ళలోకి తనవంక చూస్తున్నప్పుడు ఒకవిచిత్రమైనమార్పు—ఒకవిధమైన స్వతంత్రభావంతో కూడిన చిరునవ్వు—రాసాగింది. అప్పటినించీ తనకూ అతనికీ ఏదో ఆహ్లాదకరమైన బాంధవ్యం—బంధం—ఏర్పడ్డట్టు అనిపించింది తనకు. ఈ బంధం తనకూ అతనికీతప్ప మరొకరికి అర్థంకావటం కష్టం. ఇంత మాత్రంచేత తన పాతివ్రత్యానికి కలిగేఆటంకంకూడా ఏమీ లేదు కనుక తన అంతరాత్మ తన నేమీ బాధించలేదు.

కాని ఆరాత్రి చీకట్లో తను భోంచేసి చెయ్యి కడుక్కొని వస్తుండగా ప్రకాశం తనను వెనకనించివచ్చిఆలింగనం చేసుకుని మెడమీద ముద్దుపెట్టుకుని ఏమీ జరగనట్టు నిశ్చింతగా వెళ్ళిపోయినందుకు తనా బాధ్యురాలు? ఇందువల్ల తనకు ఏమాత్రమైనా సుఖంకలిగినా అది తనతప్పుకాదు. తనను తనభర్త అంతప్రేమగా పరామర్శించి ఎంతకాలమయిందో! ప్రకాశం ఆపనిచెయ్యకపోతే బాగుండేదని తను అనుకోకపోలేదు, అందువల్ల కలిగినసుఖాన్ని తను హృదయంలో దాచిపెట్టి ఆరాధించలేదు. చేసుకున్నవారికి చేసుకున్నంతా! తనకు ఇటువంటిఅల్పసుఖాలు తనభర్తఇవ్వకపోతే లేకుండా జరుపుకుపోవాలనేకాని వీటికోసం దేశంమీదఉన్న మగవా

క్కిందరిమీదా పడటమేనా ?

పుణ్యపాపాలసంగతి అట్లాఉంచి ఎవరైనాచూస్తే ఎంత అప్రతిష్ఠ? అతని కేం, మగవాడు. ఆ క్షణాన తన భర్తగాని, అత్తగారుగాని, ఆడబిడ్డగాని, అవతలిభాగంలోనించి సౌభాగ్యంగాని, ప్రకాశం చెల్లెలుగాని, తల్లిగాని, తండ్రిగాని— ఎవరు దొడ్లోకి వచ్చినా తనగతి ఏమై ఉండును!

అతను అంత సాహసి! నలుగురూ చూస్తుండగానే అతను భార్యను వీపుమీద తడతాడు. ఆపిల్ల బుజాలమీద చేతులు పెట్టి వంగి ఆమెచెవిలో రహస్యం చెబుతాడు. ఆమె కూర్చున్నమంచంమీదే కూర్చుంటాడు. ఆపను లేమరోకరు చేస్తుంటే లేకితన మనిపిస్తుంది. కాని అతనుచేస్తే అనిపించదు-అతని తెలివి తేట లెటువంటివో!

పరపురుషుణ్ణి స్పృశించాలనే యావ తనకు ఏకోశానా లేదు—స్వర్గసౌఖ్యంకోసమైనాసరే. తను పెద్దపెద్ద పతివ్రతల జాబితాల్లో చేరుదామనికూడా లేదు. ప్రకాశంమీద తనకు మనస్సు పోకపోలేదు. పోయి ఏమిటి చేసేది? అతని వల్ల సుఖించే యోగ్యత తనకుంటే ప్రకాశం తనకే భర్త అయేవాడు. అదే తన వేదాంతం. ఏదో వేదాంతం లేకపోతే ఈప్రపంచంలో ఎట్లా నెగ్గుకురాగలం గనకా!

అనుకోవటమే గాని వెనకనించివచ్చి పరపురుషుడు ఆలింగనం చేసుకున్నతరువాత ఈ దిక్కుమాలిన కలికాలంలో ఏ సీత అయితే ఏంచేస్తుంది? అరుస్తుందా? నలుగురూ వచ్చి ఏం జరిగిందని అడుగుతారు. జరిగిన సంగతి చెబితే మరుక్షణంనించీ ఆ మనిషిని కొంతవరకు చెడిపోయిన మనిషికిందే

చూస్తుంది లోకం. లేక "నన్ను అతను ముట్టుకోబోయి నాడు" అని అంటే, కొంతమంది అయినా "అబ్బో! ఏం విప రీతం మనిషిరా! మగవాణ్ణి పక్కగానైనా వెళ్లనివ్వదే! ఎంత పతివ్రత!" అని హేళనచేస్తారు...ప్రకాశాన్ని అల్లరిచెయ్యా లని తనకు లేకపోవటం ఒక పాయింటుకాదు!—అతన్ని అల్లరిచెయ్యదలనుకున్నా తనకు అవకాశంలేదు కనక.

ఆనాటినించి ఈనాటివరకూ—ఈ పది పన్నెండు రోజు ల్లోనూ—ప్రకాశం తనమీద ఏడెనిమిదిసార్లయినా చెయ్యి వేశాడు. రెండుసార్లు తనను గాఢంగా కౌగిలించుకుని ఆప్యా యంగా ముద్దు పెట్టుకున్నాడు. అనేకసార్లు తనని 'కనకం' అని రహస్యంగా పలకరించాడు, ఆపిలుపులో విద్యుత్ప్రసారం ఉంది.

అతను ఇటువంటి పని చేసినప్పుడల్లా తన జీవితం ఒక్క సారి వెలిగినట్లవుతుంది. ఈ వెలుగుమూలకంగా తన మిగతా జీవితం మరీ గాఢాంధకారంలో ఉన్నదనిపిస్తున్నది. తమ కతను సుఖం కలిగించటంలేదనుకోవటం అనవసరం—అసత్యం కూడానూ, అతనిమీద కోపం తెచ్చిపెట్టుకోవటం కూడా అనవసరమే—పైగా అసాధ్యం. తనని ఇంత ప్రమాదమైన స్థితిలోకి తెస్తున్నందుకు ఏమైనా కోపంకలిగిఉంటే, అది కాస్తా మొన్న అతను "కనకం, నే నెప్పుడో నీకొంపతీస్తాను. నీ కాపరం చెడగొట్టుతాను...నీకోసం చెయ్యి చాచకుండా ఉండలేకపోతున్నాను. ఏం చెయ్యను?" అనగానే చప్పున చల్లారిపోయింది.

తప్పులోకూడా మంచితప్పూ, చెడుతప్పూ అంటూ ఉం

టుందో ఏమో! ప్రకాశం ఏంచేసినా తన అంతరాత్మకు వెగటుగా ప్రవర్తించడు. అతను ఒక్క అసహ్యమైనమాట నోటివెంట అనలేదు; ఒక్క కౌగలింత—ఒక్కముద్దు—ఇంతకంటె అధికంకోసం తనను నిర్బంధించలేదు. అతను ఏంచేసినా సరే "ఇవాళనించీ నాలో కలుషం ప్రవేశించింది. నేనికచెడిపోయినవాళ్లలో జతే!" అనిపించదు.

ఇవాళవరకూ తన అదృష్టం బాగుంది. కాని ఇట్లా ఇక ఎంతోకాలం వెళ్ళదు. వెళ్ళటం అసంభవం; ఎప్పుడో ఎవరో చూస్తారు. అసలు ఇంతకాలం ఇట్లాజరిగిఉండటమే ఆశ్చర్యం. ఇదివరకే ఎవరైనా పసిపట్టి బయటపడకుండా సమయం కోసం కనిపెట్టుకున్నారేమో అని భయంగా ఉంది. తన ఆడబిడ్డ కాలాంతకురాలు! ఆవిడ మామూలుగా తనవంక చూస్తూంటేనేఅంతరాత్మనుపరీక్షిస్తున్నట్టుంటుంది. ఈపదిపన్నెండురోజులనించీ ఆవిడకేసి చూడటానికే తనకు దడగాఉంది!

తన కిప్పుడేదిదారి? ఈ పద్మవ్యూహంలోనించి తను బయటపడటం ఎట్లా? ప్రకాశంమీద తన పంచప్రాణాలూ ఉన్నై. ఉంటే ఏం? అంతగా అయితే అతనికోసం రహస్యంగా తపించవచ్చును. అందువల్ల ప్రమాదంలేదు. కాని ఇదంతా బయటపడిపోతే తన ప్రపంచమంతా తారుమారవుతుంది. అటు తన పుట్టింటివారికీ, ఇటు అత్తవారివైపు వారికీ శాశ్వతమైన తలవంపూ, తనకు ఆత్మహత్యా తప్ప మరేమీలేదు. నిజం ఎట్లాగూ బయటపడుతుంది. బయటపడి తీరుతుంది ముమ్మాటికి నిజం!

* * *

క్రొద్దిపాటి జ్వరంగా ప్రారంభించిన ప్రకాశం వ్యాధి మందులకు ఎదురుతిరిగి అతన్ని మంచానపడదోసి లంఖణాలు చేయిస్తున్నది. పైగా అతనిది కాస్తపైత్యశరీరమో ఏమోకాని అప్పుడప్పుడూ బిగ్గరగా కలవరించడమూ, సంధించినట్లు మాట్లాడటమూ కూడా ఉంటున్నది.

"ఇప్పటికి పదిలంఖణాలు. టైఫాయిడ్ జ్వరమే అయితే ఇంకాపదిరోజు లిట్లాగే వెళ్లుతుంది. ఆతరవాత మళ్లీ ఒకనెల దాకా కోలుకోడు. అప్పటికి శలవలు దాదాపు అయిపో వస్తూ ఉంటై. ఇది నాకోసమే వచ్చిందేమో" అని కనకం లోలోపల సంతోషించింది. కనకం అంతరాత్మ ఈవిధమైన ఆలోచనలను తీవ్రంగా ఖండించింది. కాని అంతరాత్మను లక్ష్యంచేసి ఏఆడది నెగ్గుకురాగలదు? కనకం అంతరాత్మను గడ్డిపరకకింద తోసిపారేసింది. ఆమెకు ఒకటే చింత—ప్రకాశానికి వచ్చిన జబ్బు టైఫాయిడ్ కాదేమోనని! డాక్టరు ఆ విషయం రూఢిగా చెప్పలేదు—అసలాయన నోటివెంట మాటేరాదు. "రోగం ఏమిటండి" అని నిలదీసిఅడిగితే "ఏదైనా మీకు ఒకటే. నాలో నమ్మకం లేకపోతే ఇంకో వైద్యుణ్ణి పెట్టుకోండి!" అని నిర్మొహమాటంగా అన్నాడు. పేరుపడ్డవాడు ఏమంటే చెల్లేదు కనక!

ఒకనాడు సాయంకాలం సౌభాగ్యం కనకందగ్గిరకి కంట నీరు పెట్టుకుంటూ వచ్చి కూర్చుని, ఎంతప్రశ్నించినా కారణం చెప్పలేదు. కనకానికి జడ వేస్తూఉండిన ఆడబిడ్డ "ఊరుకో! అమ్మాయి, ఇంతలో వచ్చిన ప్రమాదం ఏమీ లేదులే," అన్నది.

"అది కాదండి, అక్కగారూ!... మగవాళ్ల మనస్సు తెలుసుకోవడం ఎంతకష్టమండీ!" అన్నది సౌభాగ్యం.

కనకం ఆడబిడ్డ నవ్వి "ఆడవాళ్ల విషయం మగవాళ్ళూ అట్లాగే అంటారు. దీనికి అంతేమిటి? ఇంతకూ ఇప్పుడు జరిగిం దేమిటి?" అని అడిగింది,

సౌభాగ్యం కాస్త ఆపుకున్న దుఃఖాన్ని మళ్లీ తెచ్చుకుంటూ "మావారు ఇవాళల్లా వాళ్ల సరోజనిని గురించే కలవరిస్తున్నారు! నన్ను గురించి ఒక్కసారన్నా కలవరించ లేదు ఇన్నిరోజులూ" అన్నది.

కనకమూ, ఆడబిడ్డా ఇద్దరూ బిగ్గరగా నవ్వారు.

"సరోజని ఎవరమ్మా?" అని అడిగింది కనకం.

"వాళ్ళ మేనమామకూతురు. ఎప్పుడైనా వస్తుంది. వీరంటేచాలాప్రేమ. ఏమివరసలాడుతుం దనుకున్నారు. అందుకు నాకేమి రోషంలేదు. మగవాళ్లు మనవాళ్లయితే పై ఆడవాళ్లేం చెయ్యగలరు చెప్పండి! మావారికిఆవిడగారిమీద ఇంతమోజున్నదని నాకిదివరకు తెలియదు. పోనివ్వండి. ఎవరు చేసుకున్నంత వారికీ!" అని దిగులుగా ఊరుకుంది సౌభాగ్యం.

ఆపిల్ల వెళ్ళిపోయినతరవాతకాస్సేపటివరకూ కనకంగాని, ఆడబిడ్డగాని ఈవిషయం ఏమీ ఒకరితో ఒకరు అనుకోలేదు.

కనకం హృదయం కాస్సేపు అసూయతో దహించుకుపోయింది. ఈ సరోజని ఎవతె? ప్రకాశం ఆపిల్లను సంధిలో కూడా కలవరించటానికి ఆమె అతనికి ఏమిసౌఖ్యం ఇచ్చి ఉంటుంది? తనకు సౌభాగ్యంమీదలేని అసూయ సరోజనిమీద ఎందుకుండాలో కనకం నిర్ణయించుకోలేదు.

ఈ అసూయావస్థలో మరొక ఆలోచన వచ్చి కనకం హృదయాన్ని ఒక్క ఊపు ఊపి వదిలింది. ఈసంధిలో ప్రకాశం ఆ సరోజినినికాక తనపేరే కలవరించి ఉండినట్టయితే! ఎంత అల్లరి జరిగి ఉండేదో కనకం ఊహించనైనా లేకపోయింది. ఆమెకడుపు చల్లగా ఆసరోజిని ఎవరోగాని తన మానం కాపాడింది. ఇంతకూ తనఅదృష్టం బాగుంది. ఈసారికి నిజం బయట పడబోవటంలేదు!

కనకం అప్రయత్నంగా ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, ఆడబిడ్డతో ‘‘మనసులోఉన్న మాటఅల్లా, సోదిలోవచ్చినట్టు, కలవరింతలలో బయటపడుతుంది కామాలు!’’ అన్నది.

కనకం ఆడబిడ్డ చప్పరించింది.

‘‘ఆఁ. ఆపిల్ల చాదస్తం. నువ్వు రెండుమూడుసార్లు నిద్రలో ప్రకాశంపేరు అనటం నేను విన్నాను! దాని కేమిటి?’’

కనకం ఒక్కసారిగా కొయ్యబారిపోయింది.

ఇంతకూ నిజం దాగనేలే దన్నమాట!...కాని తనఅదృష్టం బాగానే ఉంది! కావలిసింది అదీ!

48116



# మెజారిటీ

[గల్పిక]

భక్తుడుకి భగవంతుడు ప్రత్యక్షమయినాడు.. భక్తుడు పరమానంద భరితుడై ప్రపంచ విషయాలను గురించి భగవంతుడిలో తన్మయత్వం పొందాడు.

అదివరకల్లా అతన్ని 'అభినవ ప్రహ్లాదుడు' అని పిలుస్తున్న లోకం ఇప్పుడు అతని తన్మయత్వాన్ని అర్థం చేసుకోలేక అనుమానించ సాగింది.

"ఇంత తన్మయత్వం ఎక్కడా ఉండదు. దొంగవేషం వేస్తున్నాడు!" అన్నారు. "మనమీద పూర్తిగా విముఖత్వం కలిగింది" అన్నారు మిగిలిన భక్తులు.

"వీడిపని పట్టించాలి!" అన్నారు. భక్తుడు హింసపడ సాగాడు. అతనికి ప్రపంచం గొడవ అర్థంకాలేదు.

"దేవా! నే నేం పాపం చేశాను.?" అన్నాడు భక్తుడు.

"నాకోసం లోకాన్ని త్యజించావు! తప్పుచేశావు. నన్ను వదిలెయ్యి, లోకం నీదవుతుంది. నీకు నాకంటె అనవసర వస్తువు సృష్టిలోలేదు" అనిభగవంతుడు అంతర్హితుడైనాడు.

157533

ముద్రణ: బి. యన్. కె. ప్రెస్, మద్రాసు.

TL
O35,3NKR,K
38N45

THE EMBLEM OF CULTURAL ENTERTAINMENT...

వినోదానికీ విజ్ఞానానికీ సహజత్వానికీ సంస్కృతికీ
ఇదే లాంఛనము! వాహినీవారి చిత్రలాంఛనము!!

ప్రజానీకాన్ని ఆనందింపజేసి
ప్రజాభిమానాన్నీ, ఆదరాన్నీ చూరగొన్న
వాహినీ చిత్రాలు

## వందేమాతరం : సుమంగళి
## దేవత : భక్తపోతన : స్వర్గసీమ

ఉత్తమ చిత్రాన్ని చూడదలచుకున్నప్పుడు
.. వాహినీ చిత్రాన్ని మరిచిపోకండి ..

---

## వాహినీ పిక్చర్సు లిమిటెడ్

మద్రాసు :: బెజవాడ :: తాడిపత్రి